క్లుప్తంగా

మత్స్యకార సంఘం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గానికి నియామక పత్రం అందిస్తున్న ఎఫ్‌డీవో ఆశాజ్యోతి

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు స్వదేశీయ మత్స్యకార సంఘం–ఎ59 నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారికి ఎఫ్‌డీవో ఎం.ఆశాజ్యోతి, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ ఎస్.ఎస్. సుమాంజలి గురువారం నియామకపత్రం అందించారు. సంఘం అధ్యక్షుడిగా సింగిడి అప్పలరాజు, ఉపాధ్యక్షుడిగా సింగిడి లక్ష్మణరావు, డైరెక్టర్లుగా అంజూరి మాధవరావు, పొట్నూరు తాతబాబు, సిద్ధాంతపు రవి, తాటిపూడి సూర్యారావు ఎన్నికయ్యారు. తాటితూరు రైతు భరోసా కేంద్రంలో ఈ ఎన్నికలు నిర్వహించారు.

గ్యాస్ వినియోగదారుల కేవైసీకి ప్రత్యేక డ్రైవ్ నేడు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో గ్యాస్ వినియోగదారుల కేవైసీ కోసం శుక్రవారం ప్రత్యేకడ్రైవ్ నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు కేవైసీ చేయించుకోని వారు గ్యాస్ బుక్, ఆధార్ లింక్ అయిన ఫోన్‌తో స్థానిక సచివాలయం వద్దకు ఉదయం 9 గంటల నుంచి రావాలని సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

కొమ్మాది: స్థానిక సాయిరాం కాలనీలోని శ్రీ దుర్గా భవాని భవన నిర్మాణ సంక్షేమ సేవా సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం అధ్యక్షుడు వై.ఎస్. మూర్తి గురువారం ఆవిష్కరించారు. సంఘం సభ్యులు గోవిందరావు, యోగేష్, ఆర్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో కేవీపీఎస్ క్యాలెండర్..

మధురవాడ: కుల వివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం నాయకులు గురువారం ఆవిష్కరించారు. మధురవాడ జోనల్ కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద క్యాలెండర్‌ను ఆవిష్కరించి, పంపిణీ చేశారు. మధురవాడ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు సియాద్రి పైడితల్లి, బి.రాంబాబు, కొండమ్మ పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయ ప్రధాన అర్చకుడు మృతి



సుబ్బారావు శర్మ (ఫైల్)

మధురవాడ: చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ పట్నాల అప్పల సూర్య సుబ్బారావు శర్మ (86) అనారోగ్యంతో గురువారం ఉదయం చంద్రంపాలెంలో మృతి చెందారు. విజయనగరం జిల్లా మెరక ముడిదాంకి చెందిన ఈయన 1989వ సంవత్సరం నుంచి ఆలయ అర్చకులుగా సేవలు అందించడంతో పాటు ఆలయ అభివృద్ధిలోనూ విశేష పాత్ర పోషించారు. ఆయన మృతికి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సంతాపం ప్రకటించారు. సంతాప సూచకంగా ఆలయాన్ని మూసివేశారు.

అఖిల భారత క్రాఫ్ట్స్ మేళా ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పీఎం పాలెం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని శిల్పారామం (జాతర)లో ఏర్పాటు చేసిన అఖిల భారత క్రాఫ్ట్స్ మేళా గురువారం ప్రారంభమైంది. ఈ మేళాను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా పేరెన్నికగన్న చేనేత వస్త్ర ఉత్పత్తి దారులతో పాటు దేశం నలుమూలల నుంచీ హస్త కళలు, చేనేత వస్త్రాల తయారీ దారులు రూపొందించిన ఉత్పత్తులు స్టాల్స్‌లో లభిస్తాయని శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథ రెడ్డి తెలిపారు. రికార్డు స్థాయిలో 87 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో 5, 7 వార్డుల కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిళ్లా మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.



మూలకుద్దు వద్ద గోస్తని నదిలో పోలిపల్లి కాలువ కలిసే చోటు

చెంతనే నది ఉన్నా.. పక్కనే ఉన్న గ్రామాల ప్రజలకు తాగునీరు అందని పరిస్థితి. పదుల సంఖ్యలో పల్లెలకు ప్రధాన తాగునీటి వనరైన గోస్తని నదిని ఆనుకునే ఈ గ్రామాలు ఉన్నా.. పట్టించుకోని నీటి సరఫరా అధికారుల తీరు గ్రామస్తులకు శాపంగా మారింది. ఉప్పు నీరే శరణ్యమైంది.

గోస్తని చెంత..

తాగునీటి చింత

మూడు గ్రామాలకు అందని తాగునీరు • నది పక్కనే ఉన్నా తీరని దాహార్తి • పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్'



పాత మూలకుద్దులో రక్షిత మంచినీటి పథకం

తగరపువలస: గోస్తని నదిని ఆనుకుని ఉన్న మూలకుద్దు, చిప్పాడ పంచాయతీలకు చెందిన మూడు గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీమిలి మండలంలోని మూలకుద్దు పంచాయతీకి మధ్యలో, చిప్పాడ పంచాయతీని ఆనుకునే గోస్తని నది ప్రవహిస్తోంది. జిల్లాలో జీవీఎంసీతో పాటు పదుల సంఖ్యలో పంచాయతీలకు తాగునీటి వనరుగా ఈ నది ప్రధానపాత్ర వహిస్తుంది. కానీ పక్కనే ఉన్న ఈ గ్రామాల ప్రజల దాహార్తిని మాత్రం తీర్చలేకపోతోంది. గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది అలసత్వంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రహదారి వద్ద చెరకుపల్లి నుంచి అన్నవరం తీరప్రాంతంలో ఉన్న ఈ రెండు పంచాయతీలకు చెందిన పాత మూలకుద్దు, కర్ణపు వీధి, చిప్పాడ పంచాయతీలోని పండవానిపాలెం గ్రామాలకు చెందిన 200 కుటుంబాలను రెండు నెలలుగా తాగునీటి సమస్య వేధిస్తోంది. ఈ మూడు గ్రామాలకు తాగునీరు అందించేందుకు పాత మూలకుద్దులో 10వేల లీటర్లు, కర్ణపువీధి వద్ద 20వేల లీటర్లు, నమ్మివానిపాలెం వద్ద 40వేల లీటర్లు సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకులు ఉన్నాయి. పాతమూలకుద్దు, కర్ణపువీధి వద్ద ట్యాంకులకు చిప్పాడ కొండ వద్ద రెండు బోర్ల నుంచి నీరు రావలసి ఉండగా.. అందులో ఒక బోరు పాడైపోగా మరో బోరు తరచూ మొరాయిస్తోంది. టి.నగరపాలెం గోస్తని తీరం వద్ద బోరు నుంచి మూలకుద్దు మీదుగా నమ్మివానిపాలెం ట్యాంకుకు నీరు మళ్లించి అక్కడి నుంచి తిరిగి మూలకుద్దుకు పంపిస్తున్నారు. సమస్యను పరిష్కరించవలసిన ఆనందపురం గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది రాజకీయాలు మాట్లాడవద్దని మూలకుద్దు ప్రజలను హేళన చేస్తున్నారు. కాంట్రాక్టర్ పత్తా లేకుండా పోయాడు.

ఇలా చేస్తే సరి

- గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో టి.నగరపాలెం వద్ద సేకరించిన నీటిని మూలకుద్దు ట్యాంకుకు మళ్లించిన తరువాతే చిప్పాడ పంచాయతీకి నీరు చేరేది. కానీ 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం టి.నగరపాలెం నుంచి నేరుగా చిప్పాడ మళ్లించి, తరువాత వారి దయాదాక్షిణ్యాలపై మూలకుద్దుకు నీటిని మళ్లిస్తున్నారు. అలా కాకుండా మూలకుద్దు ట్యాంకు నిండిన తరువాతే చిప్పాడకు వెళ్లేలా మార్చవలసి ఉంటుంది.
- మూలకుద్దు–చిప్పాడ మార్గంలో వంతెన కింద ఇటీవల ఆకతాయిలు పైపులైన్‌ను తగలబెట్టేశారు. దీంతో ఇక్కడ నీరు వృథాగా పోతుండటంతో స్థానికులు తాత్కాలికంగా రబ్బరు తొడిగారు. దీనికి శాశ్వతంగా మరమ్మతులు చేయించాలి.
- చిప్పాడ కొండ వద్ద పనిచేస్తున్న బోరుకు నాన్ రిటర్న్ వాల్, ఆటోమేటిక్ ప్యానెల్ బోర్డులు ఏర్పాటు చేస్తే పాత మూలకుద్దు, పండవానిపాలెం, కర్ణపువీధులకు తాగునీటి సమస్య నివారించవచ్చు.



మూలకుద్దు–చిప్పాడ మార్గంలో మదుం కింద పైపునకు తాత్కాలికంగా చుట్టిన రబ్బరు తొడుగు

ఎప్పుడూ నీటికి ఇబ్బందే..



పాతమూలకుద్దులో ఎప్పుడూ తాగునీటికి ఇబ్బందే. ఎన్ని పథకాలు నిర్మించినా ముందు చూపు లేకపోవడంతో తాగునీటి సమస్య ఎదుర్కొంటూనే ఉన్నాం. మాకు శాశ్వతంగా తాగునీరు అందిస్తే చాలు. –గుజ్జు సూరమ్మ



కర్ణపువీధిలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సమగ్ర మంచినీటి పథకం



నమ్మివానిపాలెం వద్ద నిర్మించిన సమగ్ర మంచినీటి పథకం

పండగకైనా నీరివ్వండి



రెండు నెలలుగా తాగునీరు సక్రమంగా రావడం లేదు. కొత్త సంవత్సరం వేళ తాగునీరు లేకుండా పోయింది. వచ్చేది సంక్రాంతి పండగ. అప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కొయ్య ఎల్లయ్యమ్మ

ఉప్పు నీరు వినియోగిస్తున్నాం



మూలకుద్దులో వ్యక్తిగత బోర్ల నుంచి ఉప్పునీరు వస్తోంది. తాగునీరు సరిపడా రాకపోవడంతో ఈ ఉప్పునీటినే వినియోగిస్తున్నాం. నది పక్కనే ఉన్న తాగునీరు దొరకడం లేదు.

– కర్ణపు సూర్యలక్ష్మి

రేవళ్లపాలెం నిర్వాసితులకు త్వరలో టీడీఆర్‌లు



రేవళ్లపాలెం రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన వారికి నెల రోజుల్లో టీడీఆర్‌లు అందజేసి, రోడ్డు పూర్తి స్థాయిలో నిర్మిస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌తో కలసి గ్రామంలో అసంపూర్తి రోడ్డు పరిశీలించి, బాధితుల సమస్యలు తెలుసుకున్నారు. టీడీఆర్ సమస్య పరిష్కరించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేరుస్తామన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్, గచ్చిబౌలి తరహాలో మధురవాడ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రణాళికాబద్ధంగా మౌలిక సదుపాయాలు కల్పించకపోతే మురికివాడలుగా తయారవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. జీవీఎంసీ కమిషనర్ సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారం చూపించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయన దృష్టికి సమస్యలు తీసుకువచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎం.హేమలత, పి.మంగమ్మ, జనసేన నాయకుడు పంచకర్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా రీ సర్వే

పద్మనాభం: గంధవరంలో భూముల రీ సర్వేను ఈ నెల 21 నుంచి పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ కె.ఆనందరావు ఆదేశించారు. రీ సర్వేపై సచివాలయాల సర్వేయర్లతో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమక్షంలో సర్వే జరగాలన్నారు. డీఐవోఎస్‌లు రాజు, కనకబాబు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అన్నసమారాధన

తగరపువలస: చిట్టివలసలోని అయ్యప్పస్వామి పీఠాధిపతి, గురుస్వామి ఆకెళ్ల నరసింహమూర్తి జ్ఞాపకార్థం ఆయన ఇంటి వద్ద గురువారం అన్నసమారాధన నిర్వహించారు.ఆయన శిష్యులు, భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆయన కుమారులు భాగ్యరాజు, రవిగణేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో అధికారుల దృష్టికి సమస్యలు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆనందపురం సర్పంచ్ లక్ష్మి

తగరపువలస: ఆనందపురం మండలంలోని ఆనందపురం, లొడగలవానిపాలెం పంచాయతీలు ఒకే రెవెన్యూలో ఉండటంతో కొన్ని సమస్యలు ఉన్నాయని ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి తెలిపారు. ఆనందపురంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె డిప్యూటీ తహసీల్దార్ చేతన్‌కుమార్‌కు సమస్యలను వివరించారు. తమ పంచాయతీకి రావలసిన రూ.18 లక్షల స్టాంప్ డ్యూటీ ఇప్పించాలని ఆమె కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు సంబంధించి నిర్మాణం పూర్తయిన వాటికి పన్నులు వేయాలని కోరారు. కార్యక్రమంలో లొడగలవానిపాలెం సర్పంచ్ లొడగల రమణ, ఎంపీటీసీ సభ్యుడు బంటుపల్లి అప్పలస్వామి, బంటుపల్లి రమణమ్మ, చందక సూరిబాబు, బమ్మిడి సూర్యనారాయణ, శ్రీనాథ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పెంట గ్రామంలో 34 దరఖాస్తులు

పద్మనాభం: మండలంలోని పెంట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 34 మంది దరఖాస్తు చేసుకున్నారు. మ్యుటేషన్ కోసం 29 మంది, 22ఏ కోసం ఒకరు, సర్వే చేయాలని నలుగురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ఆనందరావు, సర్పంచ్ బోదల పావని పాల్గొన్నారు.

పాలిథిన్ నిషేధానికి సహకరించండి



దుకాణదారుడికి జరిమానా వివరాలతో కూడిన నోటీసులు అందిస్తున్న శానిటేషన్ సిబ్బంది

తగరపువలస: జీవీఎంసీలో పాలిథిన్ నిషేధానికి ప్రజలతో పాటు వ్యాపారులంతా సహకరించాలని కోరుతూ గురువారం భీమిలి జోన్ శానిటేషన్ సిబ్బంది అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాలిథిన్ నిషేధిత ఉల్లంఘనకు పాల్పడేవారికి విధించే జరిమానాలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేశారు. పాలిథిన్ సంపూర్ణ నిషేధానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహలక్ష్మి నాయుడుతో పాటు శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



అరవింద్ (ఫైల్)

పీఎం పాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. పాతపట్నం ప్రాంతానికి చెందిన గొల్లంగి అరవింద్ (43) సుమారు 13 ఏళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. ప్రస్తుతం కొమ్మాది సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో సొంత ఫ్లాట్‌లో భార్య, కుమారుడితో కలిసి నివసిస్తున్నారు. అరవింద్ ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో గుమస్తాగా పని చేస్తుండగా, భార్య స్రవంతి ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా చేస్తున్నారు. గురువారం సాయంత్రం స్రవంతి ఇంటికి వచ్చి చూసేసరికి భర్త ఉరి వేసుకుని ఉండటంతో, పోలీసులకు సమాచారం అందించారు. అరవింద్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆరోగ్య సమస్యల వల్లనే అరవింద్ ఉరి వేసుకుని ఉంటాడని పీఎం పాలెం పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

భీమిలి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

భీమునిపట్నం: రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగిన భీమిలి ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. భీమిలి జోనల్ కార్యాలయంలో అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవీఎంసీ 1, 2 వార్డుల పరిధిలో అవసరమైన మేరకు రోడ్లు, కాలువలు తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటవుతున్నందున ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకు అనుగుణంగా భీమిలిలోని మెయిన్‌రోడ్డు, బీచ్‌రోడ్డు, బ్యాంక్ రోడ్డు విస్తరణ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలోని అన్ని వార్డుల్లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడానికి చర్యలను తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు, రెండు, మూడు వార్డుల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పోలీస్ బెటాలియన్‌లో వార్షిక క్రీడా పోటీలు



పోటీల్లో భాగంగా షాట్ పుట్ విసురుతున్న క్రీడాకారుడు

పీఎం పాలెం: బక్కన్నపాలెం సమీపంలోని ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో వార్షిక క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి నిత్యం వ్యాయామంతో పాటు ప్రవేశం ఉన్న క్రీడల్లో ప్రాక్టీస్ చేయడం అవసరమని పేర్కొన్నారు. క్రీడలలో రాణిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి కీర్తి లభించడంతో పాటూ డిపార్ట్‌మెంట్‌లోనూ మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. గురువారం జరిగిన రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్ తదితర పోటీలలో విజయం సాధించిన వారికి ఆయన మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పి.సత్యం, వి.నారాయణరావు, యూనిట్ డాక్టర్లు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గంటా.. ఏమైందంటా..!

మధురవాడ: ప్రజోపయోగ కార్యక్రమాన్ని ప్రారంభించకుండానే, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వెనుదిరగటం స్థానికంగా చర్చనీయాంశమైంది. వివరాలివి.. మధురవాడ శిల్పారామం (జాతర)లో భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం రూ.18 లక్షలతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసింది. గతంలో ఇక్కడ ఉన్న ప్లాంట్ సామర్థ్యం తక్కువ కావడంతో పాటు తరచూ మరమ్మతులకు గురవడంతో పర్యాటకులు ఇబ్బంది పడేవారు. దీంతో శిల్పారామం పరిపాలనాధికారి విజ్ఞప్తి మేరకు గంటకు వెయ్యి లీటర్ల శుద్ధ నీరు అందించే సామర్థ్యం గల ఆర్వో ప్లాంట్‌ను దివీస్ నిర్మించింది. గురువారం ఇక్కడ నిర్వహిస్తున్న క్రాఫ్ట్స్ మేళా ప్రారంభోత్సవానికి వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు శిల్పారామం అధికారులు దీనిపై సమాచారం అందించారు. అయితే దివీస్ యాజమాన్యం తనకు సక్రమంగా సమాచారం ఇవ్వలేదంటూ క్రాఫ్ట్స్ మేళా ప్రారంభించిన అనంతరం, ఆర్వో ప్లాంట్ ప్రారంభోత్సవానికి రాకుండానే ఎమ్మెల్యే వెళ్లిపోయారు. దీంతో చేసేది లేక దివీస్ యాజమాన్య ప్రతినిధులు, శిల్పారామం ఏవో అంతా కలసి గంటా శ్రీనివాసరావు బావమరిది జీవన్ కుమార్‌తో ప్రారంభింపజేశారు. అయితే, ప్రజోపయోగ కార్యక్రమానికి సంస్థ సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన విషయాలపై పట్టింపు ఏమిటంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

భారతీయ కళలను పరిరక్షించాలి



జ్ఞాపిక అందుకుంటున్న అమెరికన్ ప్రొఫెసర్ డా. రొక్సాన్న కామయాని గుప్త

కొమ్మాది: భారతదేశం యొక్క సంపన్న సాంస్కృతిక వారసత్వం, విభిన్న సంప్రదాయాలు ఆధునిక ప్రపంచంలో ప్రమాదంలో ఉన్నాయని అమెరికన్ ప్రొఫెసర్ డా. రొక్సాన్న కామయాని గుప్త అన్నారు. ఆధునిక భారతీయ కళలు–సంప్రదాయాల పరిరక్షణ అనే అంశంపై గీతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భారతదేశ ఔన్నత్యాన్ని విశ్వ వేదికపై ప్రతిబింబించే రాయబారుల వంటి కళలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

వ్యవసాయాధికారి కార్యాలయం మార్పు

తగరపువలస: ఆనందపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న వ్యవసాయాధికారి కార్యాలయం శిథిలావస్థలో ఉన్నందున, తాత్కాలికంగా వేములవలస రైతు సేవాకేంద్రానికి మార్పు చేసినట్లు ఏవో చావా సంధ్యా రత్నప్రభ తెలిపారు. వ్యవసాయాధికారి కార్యాలయానికి మరమ్మతులు పూర్తి కాగానే తిరిగి యథావిధిగా పాత కార్యాలయంలోనే సేవలు కొనసాగుతాయని పేర్కొన్నారు. రైతులు ఈ మార్పు గమనించాలని కోరారు.

కార్మికులకు బకాయిలు చెల్లించాకే ఆస్తులు విక్రయించాలి

తగరపువలస: చిట్టివలస జ్యూట్ యాజమాన్యం కార్మికుల బకాయిలు చెల్లించిన తరువాతే ఆస్తులు విక్రయించుకోవాలని ఐక్య కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మిల్లు వద్ద గురువారం సమావేశమైన వీరు మాట్లాడుతూ 2019 జూలై 23న జరిగిన ఒప్పందాన్ని ఉల్లంఘించి యాజమాన్యం ఆస్తులు విక్రయిస్తోందన్నారు. ఇప్పటికే కలెక్టర్, జేసీఎల్, పీఎఫ్ కార్యాలయంతో పాటు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు బకాయిల గురించి ఫిర్యాదు చేశామన్నారు. కార్మికుల బకాయిలు పూర్తిగా చెల్లించేవరకు ఆస్తులు విక్రయించడానికి వీలు లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మునకాల ఆదినారాయణ, కొండపు ఈశ్వరరావు, దల్లి అప్పలరెడ్డి, చిల్ల వెంకటరమణ, జీరు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసంఘటితరంగ కార్మికుల తరఫున పోరాడాలి

తగరపువలస: సీపీఐ శత వార్షికోత్సవాల వేళ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అసంఘటితరంగ కార్మికుల తరఫున పోరాటాలు చేయాలని చిట్టివలస లేబర్ యూనియన్ ప్రధానకార్యదర్శి కొండపు ఈశ్వరరావు కోరారు. స్థాని క గుజ్జు రామునాయుడు భవన్‌లో గురువారం నిర్వహించిన సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త ఏడాదిలో చేపట్టనున్న ప్రజా ఉద్యమాలకు ప్రజల నుంచి మద్దతు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, చిల్ల రాంపైడి, సన్నిబాబు, లక్ష్మణరావు, గిడుతూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సఫ్దర్ హష్మికి నివాళి

మధురవాడ: కళామతల్లి ముద్దు బిడ్డ సఫ్దర్ హష్మి అని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.పద్మ అన్నారు. వీధి నాటకాలు, ఇతర కళారూపాల ద్వారా ప్రజలను పోరాటాలకు ఆయుధాలుగా తయారుచేసిన గొప్ప కళాకారుడని కొనియాడారు. హష్మి 36వ వర్ధంతిని పురస్కరించుకుని కొమ్మాది జంక్షన్ వద్ద గల సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి బాధ్యురాలు కె.సుజాత, డి.శైలు, ఐద్వా కార్యదర్శి బి.భారతి, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ప్రగతిలో ఎస్ఎంసీల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎంఈవో రమణ



భీమిలిలో సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు

పద్మనాభం: పాఠశాలల అభ్యున్నతిలో ఎస్ఎంసీలు కీలక పాత్ర పోషించాలని ఎంఈవోలు పి.రమణ, ఎస్‌డీ బాబూలాల్ కోరారు. పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయం పాఠశాలల యాజమాన్య కమిటీల సభ్యులు, హెచ్ఎంలకు పాఠశాల యాజమాన్య కమిటీల బాధ్యతలు, విధులపై నిర్వహించిన ఒక రోజు శిక్షణ తరగతులను వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు ఎస్ఎంసీ సభ్యులు తమ వంతు సహకారం అందించాలన్నారు. దీనిలో భాగంగా ఎస్ఎంసీ సభ్యులు, హెచ్ఎంలకు మాడ్యూళ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆర్‌పీలు శ్రీనివాస్ పాత్రో, కె.ప్రసాద్, వి.శ్రీనివాసరావు, అముజూరి ఈశ్వరరావు పాఠశాల యాజమాన్య కమిటీల సమావేశాల నిర్వహణ, పాఠశాల అభివృద్ధికి ప్రణాళికల రూపకల్పన, పాఠశాలల సామాజిక తనిఖీ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. మత్తుపదార్థాలను నిషేధించేందుకు కృషి చేస్తామని ఎస్ఎంసీ సభ్యులు, హెచ్ఎంలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పద్మనాభం హైస్కూల్ హెచ్ఎం ఎ.బాలామణి, సీఆర్ఎంటీ ఎం.బంగారునాయుడు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేస్తే సత్ఫలితాలు

భీమునిపట్నం: ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీలోని విద్యార్థుల తల్లిదండ్రులు కలసి సమన్వయంగా పని చేస్తే మంచి ఫలితాలను పొందవచ్చని ఎంఈవో శివరాణి అన్నారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ మరియు బాధ్యతలు' అంశంపై ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీ సభ్యులతో భీమిలిలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు రమాదేవి, సంతోష్‌కుమార్, ప్రసాద్, అమర్‌నాథ్ పాల్గొన్నారు.